ఎల్‌ఏసీ వద్ద మళ్లీ గస్తీ

- సరిహద్దు వివాదంపై భారత్-చైనా మధ్య అంగీకారం
- బ్రిక్స్ సదస్సుకు ముందు కీలక పరిణామం

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: భారత్-చైనా మధ్య తూర్పు లఢక్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద గత కొన్నేండ్ల నుంచి కొనసాగుతున్న ప్రతిష్ఠంభనపై ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో కీలక ముందడుగు పడింది. ఎల్‌ఏసీ వెంబడి గస్తీని పునరుద్ధరించాలని రెండు దేశాలు అంగీకారానికి వచ్చినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఢిల్లీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత్-చైనా మధ్య గత కొన్నివారాలుగా దౌత్య, సైనిక స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ చర్చల ఫలితంగా ఎల్‌ఏసీ వెంబడి గస్తీ ఏర్పాట్లపై అంగీకారం కుదిరిందని, ఇది తూర్పు లఢక్‌లో బలగాల ఉపసంహరణకు దారితీస్తుందని తెలిపారు. రష్యాలో జరుగనున్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్న వేళ ఈ పరిణామం చోటు చేసుకున్నది. దీనిని కీలక పురోగతిగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నట్టు ప్రచారం జరుగుతున్నప్పటికీ ఈ విషయమై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గల్వాన్ లోయలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగినప్పటి నుంచి తూర్పు లఢక్ సరిహద్దుల్లో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. 2020 జూన్ 15న జరిగిన ఆ ఘర్షణలో 20 మంది భారత జవాన్లు, దాదాపు 40 మంది చైనా సైనికులు మరణించిన విషయం విదితమే. ఆ తర్వాత తాత్కాలికంగా బలగాలు వెనక్కి వెళ్లినప్పటికీ రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడలేదు.

మన విద్యార్థులది బిజినెస్ మైండ్!

డిగ్రీ చదువుతుండగానే వ్యాపారాలు ప్లాన్ చేస్తున్న 32.5% మంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: భారత్‌లో 32.5 శాతం కళాశాల విద్యార్థులు ఇప్పటికే వ్యాపారాలను ప్రారంభించడంలో చురుగ్గా నిమగ్నమై ఉన్నారని ఐఐటీ-మండీ నివేదిక వెల్లడించింది. ప్రపంచ సగటు 25.7 శాతం కన్నా ఇది ఎక్కువని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 57 దేశాల్లోని విద్యార్థి వ్యాపారవేత్తలపై నిర్వహించిన 'గ్లోబల్ యూనివర్సిటీ ఆంత్రప్రెన్యూరియల్ స్పిరిట్ స్టూడెంట్స్ సర్వే-2023'లో భాగంగా దేశీయంగా ఓ సర్వే నిర్వహించి ఈ నివేదికను వెలువరించింది. ఐదేండ్ల క్రితం డిగ్రీ తర్వాత 69.7 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం అన్వేషించేవారని.. ఇప్పుడు అది 52.2 శాతానికి తగ్గిపోయిందని నివేదిక వెల్లడించింది.

ఐదుగురు నక్సల్స్ మృతి

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 21: ఛత్తీస్‌గఢ్ - మహారాష్ట్ర సరిహద్దుల్లో తుపాకులు గర్జించాయి. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య సోమవారం సాయంత్రం భీకర పోరు సాగింది. ఇందులో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా భామర్‌గఢ్ తహసీల్ పరిధిలోని కోపరీ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో సీ-60 భద్రతా దళాలు గాలింపు చేపట్టాయి. వీరికి మావోయిస్టులు ఎదురుపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఇరు పక్షాల మధ్య సుమారు అరగంట పాటు కాల్పులు సాగాయి. ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు.

జనాభా నియంత్రణే నేరమా?

- దక్షిణాది రాష్ట్రాల పాలిట శాపంగా పాపులేషన్ కంట్రోల్
- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో అన్యాయం!
- ఉత్తరాది రాష్ట్రాల్లో భారీగా పెరగనున్న స్థానాల సంఖ్య
- దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం స్వల్పంగా పెరగనున్న సీట్లు
- లోక్‌సభ, దేశ రాజకీయాల్లోనూ తగ్గనున్న ప్రాబల్యం
- తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్యలతో మొదలైన చర్చ

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై మరోసారి చర్చ మొదలయ్యింది. త్వరలో జనగణన చేపట్టి, కొత్త జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాలను కేంద్రం పునర్విభజన చేయనుందనే ప్రచారం జరుగుతున్నది. ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరగనుంది. మరోవైపు లోక్‌సభతో పాటు దేశ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరగనుంది. కేంద్రంలో అధికారంలో ఎవరుండాలనేది నిర్ణయించడంలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర తగ్గిపోనున్నది. తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలతో ఇది చర్చనీయాంశంగా మారింది. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ... 'ఇప్పుడు చిన్న కుటుంబం వద్దని, 16 మంది పిల్లలను కని, పెంచాలని ప్రజలు అనుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి' అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తమిళనాడు సహా జనాభా నియంత్రణ పద్ధతులను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే అభిప్రాయాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఫిబ్రవరిలో ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం తీర్మానం చేసింది.

వచ్చే ఎన్నికల నాటికి పునర్విభజన

దేశంలో చివరగా 1972లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రక్రియ చేపట్టారు. ఇప్పుడు 2026లో మరోసారి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరపాలని కేంద్రం భావిస్తున్నది. ఇంకా జనగణన ప్రారంభం కాని నేపథ్యంలో 2026కు కాకపోయినా వచ్చే ఎన్నికల నాటికి పునర్విభజన జరిగే అవకాశం ఉంది. అయితే, సీట్ల సంఖ్యను పెంచకుండా పునర్విభజన చేస్తారా లేదా సీట్ల సంఖ్యను పెంచుతారా అనే స్పష్టత రావాల్సి ఉంది. సీట్ల సంఖ్యను పెంచాలని నిర్ణయిస్తే ఒక అంచనా ప్రకారం 848 లోక్‌సభ స్థానాలు ఏర్పటయ్యే అవకాశం ఉంది. ఇలా చేస్తే దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో జనాభాకు తగ్గట్టుగా సీట్లు పెరగనున్నాయి. సీట్ల సంఖ్యను 543గానే కొనసాగిస్తే జనాభాకు తగ్గట్టుగా కొన్ని రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య తగ్గి, మరికొన్ని రాష్ట్రాల్లో పెరిగే అవకాశం ఉన్నది.

ఉత్తరాది రాష్ట్రాలకు నజరానా

జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఉత్తరాది రాష్ట్రాలకు నజరానాగా మారనుంది. ముఖ్యంగా జనాభా భారీగా పెరిగిన ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో భారీగా లోక్‌సభ నియోజకవర్గాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఈ రెండు రాష్ట్రాల్లో కలిపి 120 స్థానాలు ఉండగా ఇది 222కు పెరిగే అవకాశం ఉంది. అంటే, దాదాపు 85 శాతం పెరుగుదల ఉండనుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం 80 లోక్‌సభ స్థానాలు ఉండగా ఏకంగా 143కు పెరగవచ్చు. బీహార్‌లో ప్రస్తుతం 40 స్థానాలు ఉండగా 79కి పెరగనున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లోనూ భారీగా లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెరగనుంది. ఇదే జరిగితే ఉత్తరాదిన యూపీ, బీహార్ లాంటి మూడు నాలుగు రాష్ట్రాలే కేంద్ర రాజకీయాలను నిర్దేశించే స్థాయిలో ప్రాబల్యం చూపగలవు.

దక్షిణాదికి అన్యాయం

స్వాతంత్య్రం తర్వాత దేశంలో జనాభా విపరీత పెరుగుదల పెద్ద సమస్యగా ఉండేది. ఈ నేపథ్యంలో 1970ల నుంచి జనాభా నియంత్రణను ప్రభుత్వాలు జాతీయ లక్ష్యంగా మార్చి, ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేశాయి. వీటిని దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా అమలు చేసి జనాభాను నియంత్రించాయి. ఇదే ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల పాలిట శాపంగా మారే ప్రమాదం ఉంది. ఒకవేళ జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దేశ రాజకీయాల్లో సౌత్ ఇండియా ప్రాబల్యం భారీగా తగ్గిపోనున్నది. లోక్‌సభ స్థానాల సంఖ్య 848కు పెరిగితే దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య ఇప్పుడు ఉన్న 129 నుంచి 165 శాతానికి పెరుగుతుంది. అంటే, 28 శాతం సీట్లు పెరుగుతాయి. తెలంగాణలో 17 నుంచి 23కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 31కి, కర్ణాటకలో 28 నుంచి 41కి, తమిళనాడులో 39 నుంచి 49కి పెరుగుతాయి. కేరళలో ఉన్న 20 సీట్లలో ఒక్క సీటు కూడా పెరగదు.



దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల(అంచనా)

రాష్ట్రం	ప్రస్తుతం	పునర్విభజన తర్వాత
తెలంగాణ	17	23
ఏపీ	25	31
తమిళనాడు	39	49
కర్ణాటక	28	41
కేరళ	20	20

ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల(అంచనా)

రాష్ట్రం	ప్రస్తుతం	పునర్విభజన తర్వాత
యూపీ	80	143
బీహార్	40	79
మహారాష్ట్ర	48	76
ఎంపీ	29	52
గుజరాత్	26	43

గుజరాత్‌లో 250 కోట్ల డ్రగ్స్ సీజ్

గాంధీనగర్, అక్టోబర్ 21: గుజరాత్‌లోని భరూచ్ జిల్లా అంక్‌లేశ్వర్ జీఐడీసీ ప్రాంతంలోని అవ్‌సర్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.250 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. సూరత్, భరూచ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.14.10 లక్షల విలువైన 141 గ్రాముల ఎండీ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. 427 కిలోల అనుమానిత మాదక ద్రవ్యాలను పరీక్ష కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపారు. అవ్‌సర్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ విశాల్ పటేల్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల అంక్‌లేశ్వర్ ప్రాంతంలోనే రూ.5 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశారు.

64 ఏండ్ల తర్వాత పాక్‌లో హిందూ ఆలయం పునర్నిర్మాణం

లాహోర్, అక్టోబర్ 21: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో గల ఒక హిందూ దేవాలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.30.34 లక్షల బడ్జెట్ కేటాయించింది. ఆలయం నిర్వహణ ఆగిపోయిన 64 ఏండ్ల తర్వాత తాజాగా మొదటి దశ పనుల కోసం ఈ మొత్తాన్ని కేటాయించినట్టు డాన్ పత్రిక పేర్కొంది. పాక్‌లో మైనారిటీల ప్రార్థనా స్థలాలను పర్యవేక్షించే నిర్వాసితుల ట్రస్ట్ ఆస్తి బోర్డ్(ఈటీపీబీ) ఈ నిధులతో నరోవాల్ జిల్లా జఫర్‌వాల్ పట్టణంలోని బయోలి సాహిబ్ దేవాలయ పనులను ప్రారంభించింది. ప్రస్తుతం నరోవాల్ జిల్లాలో ఒక్క హిందూ దేవాలయమూ లేదు. గత 20 ఏండ్లుగా పాక్ ధర్మస్థాన్ కమిటీ బయోలీ సాహిబ్ ఆలయాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నది.

నవంబర్ 1-19 మధ్య ఎయిర్ ఇండియాలో ప్రయాణించొద్దు

ఖలిస్థాన్ ఉగ్రవాది పన్నూ బెదిరింపులు

టొరంటో, అక్టోబర్ 21: ఖలిస్థాన్ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ భారత్‌పై మళ్లీ బెదిరింపులకు దిగాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏండ్లు కావస్తున్న సందర్భంగా 'ఎయిర్ ఇండియా' విమానాలపై దాడి జరగవచ్చునని పన్నూ హెచ్చరికలు జారీచేశాడు. నవంబర్ 1 నుంచి 19 వరకు 'ఎయిర్ ఇండియా' విమానాల్లో ఎవరూ ప్రయాణించవద్దని అతడు సోమవారం వార్నింగ్ ఇవ్వటం సంచలనం రేపింది. గత కొద్ది రోజులుగా భారత్‌లో పలు విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. ఈ తరుణంలో పన్నూ నుంచి ఈ విధమైన బెదిరింపులు వెలువడటం చర్చనీయాంశమవుతున్నది. గత ఏడాది కూడా పన్నూ ఇదే విధమైన తీవ్రమైన మాటలతో భారత్‌పై అక్కసు వెళ్లగక్కాడు.

పరువు నష్టం కేసులో కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ విద్యార్హతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై జారీ అయిన సమన్లను కొట్టేయాలన్న ఆయన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. అయితే అన్ని వివాదాలను కోర్టు విచారణ చేయవచ్చని, కేసు మెరిట్స్‌పై తాము ఎలాంటి అభిప్రాయాన్ని వెల్లడించడం లేదని ధర్మాసనం పేర్కొంది. కేజ్రీవాల్ తరపున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ అన్ని వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేవైతే మోదీ క్రిమినల్ పరువు నష్టం కేసు దాఖలు చేయాలి కానీ గుజరాత్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కాదన్నారు.

విమాన బెదిరింపులకు పాల్పడితే జీవితఖైదు!

న్యూఢిల్లీ: విమానాల్లో బాంబు పెట్టామంటూ బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు హెచ్చరించారు. నిందితులను 'నో ఫ్లై' జాబితాలో చేరుస్తామన్నారు. ఢిల్లీలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీచేశారు. బాంబు బెదిరింపు వరుస ఘటనలపై స్పందించిన మంత్రి.. ఇది చాలా సున్నితమైన అంశమని పేర్కొన్నారు. బెదిరింపుకాల్స్‌కు పాల్పడే వారికి జీవితఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

భర్త దీర్ఘాయుష్షు కోసం ఉపవాసం.. ఆపై హత్య

కర్వా చౌత్ నాడు భర్తను చంపిన భార్య

ఇస్మాయిల్‌పూర్, అక్టోబర్ 21: భర్త దీర్ఘాయుష్షు కోసం ఉపవాసం ఉండి ప్రార్థనలు చేసిన ఓ భార్య కొన్ని గంటలకే అతడికి విషమిచ్చి చంపింది. ఉత్తరప్రదేశ్‌లోని కౌశంబి జిల్లా ఇస్మాయిల్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తన భర్త శైలేశ్ కుమార్(32)కు వేరే మహిళతో సంబంధం ఉందన్న అనుమానం కారణంగా సవిత అనే మహిళ ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. కర్వా చౌత్ పండుగ సందర్భంగా భర్త దీర్ఘాయుష్షు కోసం ఆదివారం సవిత ఉపవాసం ఉంది. శైలేశ్ పండగ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. సాయంత్రం ఉపవాసం విరమించిన తర్వాత సవిత తన భర్తతో గొడవ పడింది. అయితే ఆ తర్వాత పరిస్థితి సద్దుమణిగినట్టు కనిపించింది. దంపతులిద్దరూ కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత భర్తను పక్కింటికి వెళ్లి ఏదో వస్తువు తెమ్మని చెప్పి సవిత పారిపోయింది. శైలేశ్ తిన్న భోజనంలో విషం కలిసిందని తెలిసి అతడిని దవాఖానకు తరలించారు. అక్కడ అతడి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. చికిత్స పొందుతూ శైలేశ్ మృతి చెందాడు. పోలీసులు సవితను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇజ్రాయెల్ దాడుల కారణంగా బీరుట్ శివార్లలో వెలువడుతున్న పొగలు

బీరుట్‌లో విధ్వంసం!

హెజ్బొల్లా ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ దాడి

నగరాన్ని ఖాళీ చేసి వెళ్తున్న ప్రజలు

బీరుట్, అక్టోబర్ 21: హెజ్బొల్లా ఆర్థిక వ్యవహారాలతో సంబంధాలున్న ప్రదేశాలపై దాడులు చేయనున్నామని, ఆ పరిసరాల్లోని వారు ఇండ్లు ఖాళీచేసి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ లెబనాన్ ప్రజలను హెచ్చరించింది. దీంతో లెబనాన్‌లోని అనేక ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా బయలుదేరి సురక్షిత ప్రాంతాలవైపు వెళ్లిపోయారు. ఇజ్రాయెల్ హెచ్చరిక వెలువడిన వెంటనే లెబనాన్‌లోని పలుచోట్ల పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. రాజధాని నగరం బీరుట్ దక్షిణ ప్రాంతంలో భారీగా మంటలు లేచాయి. దీంతో భయాందోళన చెందిన ప్రజలు ఒక్కసారిగా వీధుల్లోకి రావడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. 'లెబనాన్ వాసులారా! హెజ్బొల్లా అల్ ఖర్ద్ అల్ హస్సన్ అసోసియేషన్‌కు సంబంధించిన వసతులపై దాడులు చేయనున్నాం. వాటి నుంచి దూరంగా వెళ్లిపోండి' అంటూ ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. హెజ్బొల్లా ఆర్థిక కార్యకలాపాలను అల్-ఖర్ద్ అల్ హస్సన్ సంస్థ నిర్వహిస్తున్నట్టు అమెరికా ఇటీవల వెల్లడించింది. ఆ సంస్థకు లెబనాన్‌లోని పలు ప్రాంతాల్లో 30 శాఖలున్నట్టు తెలిపింది. వాటిలో 15 శాఖలు సెంట్రల్ బీరుట్‌లో జనసాంద్రత అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఉన్నాయి. ఇజ్రాయెల్ ప్రకటనపై హెజ్బొల్లా లేదా లెబనీస్ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన వెలువడలేదు. ఏడాది క్రితం పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ మద్దతుగా హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై రాకెట్ల దాడి చేయడంతో రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైంది.

మీరు మా రాజు కాదు

ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బ్రిటన్ రాజుకు అవమానం

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్-3కి అవమానం ఎదురైంది. ఆయన తమ రాజు కాదంటూ ఆస్ట్రేలియా ఆదివాసీ సెనెటర్ ఒకరు గట్టిగా నినాదాలు చేయటంతో కింగ్ చార్లెస్-3 షాక్‌కు గురయ్యారు. సోమవారం కింగ్ చార్లెస్ ఆస్ట్రేలియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. అధికారికంగా ఆస్ట్రేలియాకు పాలకుడైన ఆయన, పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించిన వెంటనే ఆస్ట్రేలియా ఆదివాసీ సెనెటర్ లిడియా థోర్పే రాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేయటం మొదలుపెట్టారు. బ్రిటిష్ వలసదారులు తమ దేశంలోని ఆదివాసీల భూములు లాక్కున్నారని, తమపై నరమేధానికి పాల్పడ్డారని థోర్పే ఆరోపించారు. 'మా నుంచి దోచుకున్నదంతా మాకు ఇచ్చేయండి. ఇది మీ భూమి కాదు. మీరు మా రాజు కాదు' అంటూ దాదాపు నిమిషానికిపైగా పెద్ద గొంతుతో నినాదాలు చేశారు. 2022లో సెనెటర్‌గా ఎన్నికైన ఆమె వలస విధానాన్ని మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్నారు. క్వీన్ ఎలిజబెత్-2ను దేశాధినేతగా కొనసాగించాలని 1999 రెఫరెండంలో ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కింగ్ చార్లెస్-3 ఆస్ట్రేలియాకు రాజుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆస్ట్రేలియా, సమావో దేశాల్లో 9 రోజుల పర్యటన చేపట్టారు.

భారత్ లౌకిక దేశంగా ఉండొద్దా?

పిటిషనర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలను తొలగించాలంటూ దాఖలపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించిన సుప్రీంకోర్టు పిటిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషలిస్ట్, సెక్యులర్ పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో భాగమని కోర్టులు ఇప్పటికే పలు తీర్పుల్లో నొక్కి చెప్పాయని పేర్కొంది. ఈ రెండు పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలంటూ బీజేపీ నేత, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి సహా పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాలను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్, అడ్వకేట్ అయిన విష్ణుశంకర్‌జైన్ తన వాదనలు వినిపిస్తూ 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణపై పార్లమెంటులో అసలు చర్చే జరగలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జస్టిస్ ఖన్నా.. సోషలిజం అంటే అందరికీ సమాన అవకాశాలు కల్పించడమేనని, దాని భావన సమానత్వమేనని స్పష్టం చేశారు. దీనిని పాశ్చాత్య ధోరణిలో చూస్తే వేరే అర్థం వస్తుందని పేర్కొన్నారు. సెక్యులరిజం అనే పదం కూడా అంతేనని నొక్కి చెప్పారు. మరో న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ ఇందిరాగాంధీ ప్రభుత్వం అత్యయిక స్థితి విధించిన సమయంలో ఈ సవరణ ప్రభావితమైందని చెప్పారు. లాయర్ల వాదనలకు జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. 'భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడం లేదా?' అని ప్రశ్నించారు. సుబ్రమణ్యస్వామి కూడా తన వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది.

సీజేఐపై ఎస్పీ నేత అనుచిత వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డీవై చంద్రచూడ్‌పై సమాజ్‌వాదీ నేత, ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆదివారం పుణెలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ, అయోధ్య రామజన్మ భూమి వివాదం పరిష్కారం కోసం తాను దేవుడ్ని ప్రార్థించానని చెప్పారు. దీనిపై సోమవారం ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ స్పందిస్తూ, 'మీరు చనిపోయినవారిని తిరిగి బతికిస్తే.. అవి దయ్యాలుగా మారి ప్రజల్ని వేధిస్తాయి. చాలా మంది ఇలాగే మాట్లాడుతారు. నేను వాటిని పట్టించుకోవాల్నా?' అని అన్నారు. ఆయన వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని బీజేపీ అధికార ప్రతినిధి రాకేశ్ త్రిపాఠీ అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీజేఐని ఉద్దేశించి కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ ఉదిత్ రాజ్ కూడా సోమవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అయోధ్య కేసులో దేవుడ్ని ప్రార్థించానని సీజేఐ చెప్పారు. అలాగే మిగతా కేసుల్లోనూ దేవుడ్ని ప్రార్థించాల్సింది. ఆ కేసుల్లోనూ సుప్రీంకోర్టు, హైకోర్టుల నుంచి సామాన్యుడికి న్యాయం దక్కేది. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటీ దుర్వినియోగాన్ని ఆపాల్సింది.. కదా!' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

స్టెతస్కోప్‌తో మాటలు!

- మూగవారి కోసం సరికొత్త సాంకేతికత
- అభివృద్ధి చేసిన ట్రిపుల్ ఐటీ హైదరాబాద్



హైదరాబాద్: స్టెతస్కోప్ సాయంతో మూగవారి భావాలను మాటలుగా మార్చగలిగే అధునాతన సైలెంట్ స్పీచ్ ఇంటర్‌ఫేస్(ఎస్ఎస్ఐ)ను ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రొఫెసర్లు రామనాథన్ సుబ్రమణియన్, వినీత్ గాంధీ నేతృత్వంలో నీల్ షా, నేహ సహిప్‌జాన్ ఈ వినూత్న సాంకేతికతను తయారు చేశారు. సాధారణంగా సైలెంట్ స్పీచ్ ఇంటర్‌ఫేస్ కోసం లిప్ రీడింగ్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. అల్ట్రాసౌండ్ టంగ్ ఇమేజింగ్, రియల్ టైమ్ ఎంఆర్ఐ, ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆర్టికులోగ్రఫీ వంటి ఇతర సాంకేతికతలు అందుబాటులో ఉన్నప్పటికీ ఇవి చాలా ఖర్చుతో కూడుకున్నవి. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధకులు తయారుచేసిన 'స్టెతోటెక్స్ కార్పస్' వీటికి భిన్నమైనది. ముందుగా పరిశోధకులు వేర్వేరు ప్రదేశాల్లో మనుషులు మాట్లాడేటప్పుడు వారి గొంతులో కలిగే వైబ్రేషన్స్‌ను, మాటలను రికార్డు చేశారు. తర్వాత ఈ వైబ్రేషన్స్‌ను మాటలుగా మార్చే ఒక మాడల్‌ను తయారుచేశారు. మూగవారు మాట్లాడేటప్పుడు వచ్చే వైబ్రేషన్స్‌ను సాధారణ స్టెతస్కోప్ గుర్తించి బ్లూటూత్ ద్వారా మొబైల్ ఫోన్‌కు చేరుతాయి. పరిశోధకులు అభివృద్ధి చేసిన మాడల్ ఇన్‌స్టాల్ అయిన ఉన్న ఫోన్ ఈ వైబ్రేషన్స్‌ను ఎప్పటికప్పుడు మాటలుగా మార్చేస్తుంది.

మరణించిన వారితో ముచ్చట్లు

చైనాలో ఏఐ ఆధారిత 'డెడ్‌బోట్లు'

బీజింగ్, అక్టోబర్ 21: మరణించిన ఆత్మీయులతో మాట్లాడటం అంటే సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో మాత్రమే సాధ్యం అనేది ఇప్పటివరకు ఉన్న అభిప్రాయం. చైనాకు చెందిన కొన్ని కంపెనీలు ఈ అభిప్రాయాన్ని మార్చేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మరణించిన వారి రూపంతో డిజిటల్ అవతార్‌లను ఈ కంపెనీలు అభివృద్ధి చేస్తున్నాయి. వీటికి 'డెడ్‌బోట్' అని పేరు పెట్టాయి. వారు జీవించి ఉన్నప్పుడు మాట్లాడిన మాటలు, వీడియోలను వినియోగించి ఈ అవతార్‌లను తయారుచేస్తున్నాయి. ఇవి అచ్చం మరణించిన మనిషిలానే మాట్లాడతాయి. ఇటీవల ఈ డెడ్‌బోట్‌లకు చైనాలో ఆదరణ పెరుగుతున్నది. ఇదే సమయంలో దీనిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒక మనిషి మరణించిన తర్వాత కొన్ని రోజులకు సహజంగా వారిని మర్చిపోయే ప్రక్రియకు ఈ డెడ్‌బోట్‌లు ఆటంకంగా మారతాయని, మరణించిన మనిషిని మరిచిపోకుండా చేస్తాయని టెక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పిండాలకు ఐక్యూ పరీక్ష

- తెలివైన పిల్లలను కనేందుకు అవకాశం
- అమెరికన్ స్టార్టప్ వివాదాస్పద సేవలు

న్యూయార్క్, అక్టోబర్ 21: పిల్లలు తెలివితేటలు ఎలా ఉంటాయో పిండంగా ఉన్నప్పుడే గుర్తిస్తామని చెప్తున్నది హెలియోస్పెక్ట్ జీనోమిక్స్ అనే అమెరికన్ అంకుర సంస్థ. తల్లిగర్భంలో ఉన్నప్పుడు పిండానికి పరీక్షలు నిర్వహిస్తున్నది. జన్యు మార్పిడి నైతికతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ ఈ సంస్థ అందిస్తున్న ఈ వివాదాస్పద సేవల విషయం బయటపడింది. యూకేకు చెందిన 'హోప్ నాట్ హేట్' అనే సంస్థ రహస్యంగా ఈ బాగోతాన్ని బట్టబయలు చేసింది. సంపన్నులైన దంపతులు వారికి పుట్టబోయే బిడ్డ తెలివితేటలు భవిష్యత్తులో ఎలా ఉంటాయి, ఆరోగ్యం ఎలా ఉంటుంది, పుట్టబోయే బిడ్డ అమ్మాయా, అబ్బాయా వంటి విషయాలను పిండాన్ని పరీక్షించడం ద్వారా గుర్తిస్తామని ఈ సంస్థ చెప్తున్నది. ఇందుకు గానూ యూకే బయోబ్యాంక్ డాటాను ఉపయోగిస్తున్నట్టు అంగీకరించింది. పిండాన్ని పరీక్షించేందుకు ఒక్కో దంపతుల నుంచి 4 వేల డాలర్లు వసూలు చేస్తున్నది. అయితే, ప్రస్తుతం తమ సేవలు పరీక్షల దశలోనే ఉన్నాయని, పూర్తిస్థాయిగా ప్రారంభించలేదని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.